# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.**
2. **ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రాష్ట్రానికి 30 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చేలా పాలసీని రూపొందించామని మంత్రి టీజి భరత్ శాసన సభలో తెలిపారు.**
3. **కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు నిర్మిస్తామని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసన సభలో వెల్లడించారు.**
4. **రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోము వీర్రాజును ఆపార్టీ ఎంపిక చేసింది.**
5. **ఇంద్రకీలాద్రి అభివృద్ధికి బృహత్ ప్రణాళిక రూపకల్పన చేస్తున్నామని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రియల్ టైం గవర్నెన్స్ ఆర్టిజిఎస్ వివిధ ప్రభుత్వ పథకాలు కార్యక్రమాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. కాగా ఈరోజు సాయంత్రం విజయవాడలో నిర్వహించే పుస్తకావిష్కరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

-------------------------

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రాష్ట్రానికి 30 వేల కోట్లు పెట్టుబడులు వచ్చేలా విధానాలను రూపొందించామని పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజి భరత్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. అన్ని జిల్లా కేంద్రాలలో పరిశ్రమలకు ఇస్తున్న ప్రోత్సాహకాలపై ప్రచారం నిర్వహిస్తున్నామని తెలుపుతూ

...వాయిస్..

-------------------------

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, అవసరమైన చోట తహశీల్దారు కార్యాలయాలను నిర్మిస్తామని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయాల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ....జిల్లాల విభజనలో గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న లోపాలను

వరుసగా సరిచేస్తున్నామని తెలిపారు. దాతల నుండి నిధులు సేకరించడం, ఎలా ఖర్చు పెట్టడం అంశాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారని ఆయన తెలియజేస్తూ..

...వాయిస్.

---

రాష్ట్ర శాసనసభలో ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో 'ఆడుదాం ఆంధ్ర'పై చర్చలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూ. 119.19కోట్లు కేటాయించగా.. దానిలో రూ. 119.11 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. దోషులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోము వీర్రాజును ఆపార్టీ ఎంపిక చేసింది. ఖాళీగా ఉన్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమిలో భాగంగా తెలుగు దేశం పార్టీ 3, జనసేన, బీజేపి ఒక్కొక్కటి చొప్పున పోటీచేయనున్నారు. తెలుగు దేశం పార్టీ అభ్యర్థులుగా బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మలను పార్టీ నిన్న ప్రకటించింది. జనసేన అభ్యర్థిగా నాగబాబు ఇప్పటికే నామినేషన్ వేశారు. నామినేషన్ల దాఖలుకు నేడే చివరి రోజు కావడంతో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు, సోము వీర్రాజు ఈరోజు నామినేషన్ వేయనున్నారు.

---

ఇంద్రకీలాద్రి అభివృద్ధికి బృహత్ ప్రణాళిక రూపకల్పన చేస్తున్నామని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి తెలిపారు. ఆలయం అభివృద్ధిపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. కనకదుర్గ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, చేపట్ట బోయే పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే విజయదశమి నాటికి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్నారు. భక్తులకు విశ్రాంతి గదులు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు.

---

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి పొగాకు బోర్డు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. ప్రకాశం జిల్లాలో ఈరోజు పొగాకు కొనుగోళ్లను ఆయన ప్రారంభించారు. ఒంగోలులోని ఒకటవ వేలం కేంద్రంలో ఈ ఏడాది వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ వేలంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, బయ్యర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోర్డు పరిధిలోని 16 వేలం కేంద్రాల్లో ఈ నెలాఖరు లోపు వేలం ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ ఏడాది 200 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంటూ...

..వాయిస్..

---

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర

ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024వ సంవత్సరం డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి చేస్తున్నారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లోని క్షయవ్యాధి రోగుల వద్దకు సంచార ఎక్స్ రే మిషన్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అందించిన సంచార ఎక్స్ రే మిషను కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో క్షయ వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారని అన్నారు. ఈ మిషన్ ద్వారా రోగుల ఇంటి వద్దనే ఎక్స్ రే తీసుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోము వీర్రాజును ఆపార్టీ ఎంపిక చేసింది. ఖాళీగా ఉన్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమిలో భాగంగా తెలుగు దేశం పార్టీ 3, జనసేన, బీజేపి ఒక్కొక్కటి చొప్పున పోటీచేయనున్నారు. తెలుగు దేశం పార్టీ అభ్యర్థులుగా బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మలను పార్టీ నిన్న ప్రకటించింది. జనసేన అభ్యర్థిగా నాగబాబు ఇప్పటికే నామినేషన్ వేశారు. నామినేషన్ల దాఖలుకు నేడే చివరి రోజు కావడంతో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు, సోము వీర్రాజు ఈరోజు నామినేషన్ వేయనున్నారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలు నిన్న ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన తెప్పపై తొలిరోజు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. స్వామివారు పుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులను ఆశీర్వదించారు.

======================